# సాక్షి
## అన్నమయ్య జిల్లా

సోమవారం। 1। ఏప్రిల్। 2024




**శుభాల తోరణం.. రంజాన్ మాసం**

రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో వారు చేసే ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమం ఎన్నో రెట్ల ఫలితాలను అందిస్తుందనేది వారి విశ్వాసం. -8లో

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ సోమ (సా॥) | సహర్ మంగళ (ఉ॥) |
|---|---|---|
| రాయచోటి | 6.30 | 4.52 |
| రాజంపేట | 6.32 | 4.52 |
| పీలేరు | 6.35 | 4.48 |
| మదనపల్లె | 6.33 | 4.56 |

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.180 | రూ.240 |
| రెండోరకం | రూ.100 | రూ.178 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 80 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 444 | 444 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 120.780 కిలోలు

## న్యూస్‌రీల్

### ఆరోతరగతి ప్రవేశపరీక్షకు గడువు పెంపు

**పెనగలూరు (ఓబులవారిపల్లె):** పెనగలూరులోని ఏపీ ఆదర్శపాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించే ప్రవేశపరీక్ష గడువు ఏప్రిల్ 6వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయాన్ని పెనగలూరు ఏపీ ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ సహజబ్లెస్సీ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 931 కిలోల వెండి స్వాధీనం

**రాయచోటి టౌన్:** రాయచోటి పట్టణంలో ఎలాంటి రశీదులు, రికార్డులు లేని 931 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ పోలీసుల కథనం మేరకు శనివారం రాత్రి పట్టణంలో ఓ ఇంటిలో వెండి నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. తమిళనాడుకు చెందిన వ్యాపారులు సంపత్, కన్నా నుంచి వెండితో పాటు రూ.21లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. నగదు, వెండిని ఐటి శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

### పది మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి

**రాయచోటి:** పదో తరగతి పరీక్షల మూల్యాంకనం నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని డైట్ హైస్కూల్ బాలికల ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం జరగుతుందన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఆదివారం గదులలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను స్థానిక విద్యాధికారులతో కలిసి డీఈఓ పరిశీలించారు. ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు మూల్యాంకనం చేపట్టనున్నారు. డైట్ హైస్కూల్‌లో 60 వేలు, బాలికల ఉన్నత పాఠశాలలో 90 వేల పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు.

### సంగమేశ్వరునికి రూ. 4.59లక్షల ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

**వీపునాయునిపల్లె:** మండలంలోని సంగమేశ్వరాలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగ రోజున దర్శన టికెట్‌ల ద్వారా రూ. 78వేలు వచ్చిందన్నారు. ఆరు నెలలకు సంబంధించి హుండీ ద్వారా 3.81లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

### 67 ఫిర్యాదులు పరిష్కారం

**రాయచోటి:** జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ఆదివారం 81 ఫిర్యాదులు అందగా అందులో 67 ఫిర్యాదులను పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం విడుదలైన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తం 705 ఫిర్యాదులు అందగా 669 ఫిర్యాదులను పరిష్కరించగా 36 ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. ఆదివారం వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ. 39.46 లక్షలు విలువైన నగదు, వస్తువులను సీజ్ చేయడం జరిగిందన్నారు. తొలి నుంచి ఇప్పటి వరకు రూ. 1.19 కోట్లు విలువైన నగదు, వస్తువులను సీజ్ చేసినట్లు వివరించారు.

### కోడ్ ఉల్లంఘన.. బీజేపీ నాయకుడిపై కేసు

**మదనపల్లె:** మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ శనివారం నిర్వహించిన వాహనాల ర్యాలీకి సంబంధించి,ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన కారణంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగవాన్‌పై కేసు నమోదైనట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వాహనాల ర్యాలీకి సంబంధించి ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. వాహనాల ర్యాలీకి సంబంధించి మదనపల్లె బీజేపీ నాయకులు భగవాన్ తొమ్మిది వాహనాలకు ఎన్నికల అధికారి నుంచి అనుమతులు పొందారు. అయితే ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వందల సంఖ్యలో వాహనాలతో ర్యాలీ నిర్వహించడంతో, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ ఎంపీడీఓ భానుప్రసాద్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భగవాన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

# చీప్ ట్రిక్స్..



ఈ ఫొటోలో పచ్చ కండువా కప్పించుకుంటున్న వ్యక్తి కడప బాలాజీనగర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ రాజశేఖరరెడ్డి. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన ఆయన టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి సమక్షంలో తిరిగి టీడీపీలో చేరారు. టీడీపీ నేతగా గత కొంతకాలంగా కడపలో చలామణీ అవుతున్నారు. అంతలోనే చంద్రబాబు వద్ద మరోమారు అదే మాజీ కార్పొరేటర్‌కు టీడీపీ కండువా కప్పించారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరికలంటూ ప్రచారం చేసుకున్నారు.



- తెలుగుతమ్ముళ్లకే కండువాలు వేసుకుంటున్న టీడీపీ నేతలు
- అనుకూల మీడియాలో మద్దతు పెరుగుతున్నట్లు ప్రచారం
- నాన్ లోకల్ నాయకులు అభ్యర్థులు కావడంతో ప్రచారం కోసం తాపత్రయం
- సీఎం జిల్లా పర్యటన తర్వాత జోష్ మీదున్న వైఎస్సార్‌సీపీ

ఇతను ప్రొద్దుటూరు 22వ కౌన్సిలర్ మహమ్మద్‌గౌస్. టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తీసుకెళ్లి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేర్పించారు. మూడు నెలల క్రితం ఈ ఘటన చోటు చేసుకుంది. తాజాగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మరోమారు టీడీపీ కండువా కప్పి, తెలుగుదేశం పార్టీలో చేరినట్లు ప్రచారం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి చేరికలను టీడీపీ ప్రోత్సహిస్తోంది.



**సాక్షి ప్రతినిధి, కడప:** అంతంత మాత్రమే ఉన్న ప్రజా మద్దతు... ఎక్కడికెళ్లిన ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రతిఘటన. పైగా నాన్ లోకల్ ఎఫెక్ట్.. ఇవన్నీ మరిపించేందుకు తెలుగుదేశం అభ్యర్థులు 'చీప్' ట్రిక్స్'కు పాల్పడుతున్నారు. వలసల ఉధృతి అంటూ ప్రచార ఎత్తుగడలకు పాల్పడుతున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు అనువుగా ఎల్లోమీడియా ప్రచారం కల్పిస్తోంది. వాస్తవంలో టీడీపీ నాయకులు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించడంలో విఫలమయ్యారు. ఐదేళ్లుగా ప్రజల చెంతకు చేరకుండా ఉనికి కోసం మమ అన్పిస్తూ కాలక్షేపం చేశారు. ఎన్నికలు సమీపించే కొద్ది చీప్'ట్రిక్స్'ప్రదర్శిస్తూ ప్రజల్లో చర్చకు ఆస్కారం ఇస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు.

**నాన్ లోకల్ అభ్యర్థిత్వం మరిపించేందుకు....**

జిల్లాలో టీడీపీకి స్థానికంగా అభ్యర్థులు కరువయ్యారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులున్నా, డబ్బులున్నవారికే ఆ పార్టీ అధిష్టానం టికెట్లు కట్టబెట్టింది. ఈ కోవలో కడప, రాజంపేట అభ్యర్థులు మాధవీరెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్లు చెప్పవచ్చు. ఇద్దరు రాయచోటి నియోజకవర్గానికి చెందినవారు. కడపకు మాధవీరెడ్డి అభ్యర్థిత్వం ఖరారయ్యాక సోషల్ మీడియాలో ఫోకస్ కోసం తాపత్రయం పడుతున్నారు. లేని ఊపును సృష్టించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఎక్కడో నివాసం ఉంటూ రాజకీయాలకు దూరంగా ఉన్నా మాధవీరెడ్డి సోషల్ మీడియాలో పొందుతున్న ప్రచారాన్ని పసిగట్టిన టీడీపీ అభ్యర్థులు అదే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రొద్దుటూరులో ఈవీ సుధాకర్‌రెడ్డి, ముక్తియార్, కడపలో చలపతి, సత్య లాంటి నేతలకు తాజాగా కండువాలు కప్పడమని పలువురు ఉదహరిస్తున్నారు. మరోవైపు ఐదేళ్లు టీడీపీ కోసం కష్టపడిన వారిని కాదని అభ్యర్థిత్వాలు ఖరారు చేయడం కూడా ఇలాంటి టీప్'ట్రిక్స్'కు ప్రధాన కారణంగా పలువురు చెప్పుకొస్తున్నారు. రాజంపేటలో కూడా ఇలాంటి పరిస్థితే తెరపైకి వచ్చింది. స్థానిక నాయకులను కాదని రాయచోటికి చెందిన సుగవాసి సుబ్రమణ్యం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఇంకా ప్రచా రం చేపట్టిన ఆయన ఇలాంటి ఎత్తుగడలతోనే ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం.

**వైఎస్సార్‌సీపీలో జోష్...**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన తర్వాత వైఎస్సార్‌సీపీ జోష్ మీదున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. పైగా నా హయాంలో మీకుటుంబానికి లబ్ధి చేకూరి ఉంటేనే మీ బిడ్డను మరోమారు ఆశీర్వదించండి. తర తమ భేదం లేకుండా పేదలకు మేలు చేసి ఉంటేనే ఓట్లు వేయండని ధైర్యంగా అభ్యర్థిస్తుండడం వైఎస్సార్‌సీపీకి అదనపు అర్హత అయిందని పరిశీలకులు చెప్పుకొస్తున్నారు. ఈ పరిణామం తెలుగుదేశం పార్టీకి రుచించడం లేదు. దీంతో టీడీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. 'మేమంతా సిద్ధం'కార్యక్రమం తర్వాత వైఎస్సార్‌సీపీ ఊపు పెరగడమే అందుకు కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అనేక మంది టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మైదుకూరులో రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కొండారెడ్డి, కమలాపురంలో సాయినాథశర్మ లాంటి నాయకులు వచ్చి చేరడాన్ని పలువురు ఉదహరిస్తుండడం విశేషం.

## మేమంతా సిద్ధం సభను
# విజయవంతం చేయండి

**ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, విప్ కొరముట్ల శ్రీనివాసులు**



మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు:** మదనపల్లెలో ఏప్రిల్ 2వ తేదీన టిప్పుసుల్తాన్ మైదానంలో జరగబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టునటువంటి మేమంతా సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభలు విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జిల్లాకు సాగు, తాగునీరు అందించేందుకు కోట్లాది రుపాయలు మంజూరు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పేదలు, బడుగు, బలహీన వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. ఆయా వర్గాలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపిటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా, ఉప సర్పంచ్ తోట శివ సాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, విజయ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ సుబ్బరామరాజు, డైరెక్టర్లు ముజీబ్, మలిశెట్టి వెంకటరమణ, జెడ్పీటీసీ రత్నమ్మ, మాజి జెడ్పీటీసీ రాజేశ్వరి, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, కొరెడ్డి సిద్దయ్య, భరత్‌కుమార్‌రెడ్డి, బండారు మల్లిఖార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**సీఎం బస చేసే ప్రాంతం పరిశీలన**



సీఎం బస చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ క్రిష్ణారావ్

**ములకలచెరువు:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం మదనపల్లిలో జరిగే మేము సిద్ధం సభకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 1న రాత్రి ములకలచెరువులో బస చేయనున్నారు. ఈ తరుణంలో ఆదివారం పోలీసులతో జిల్లా ఎస్పీ కృష్ణారావ్ ములకలచెరువు –మదనపల్లి రోడ్డు మార్గంలో రూట్ మార్చ్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఎస్పీ ప్రసాద్ రెడ్డి,ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్,సీఐలు మధు, సద్గురుడు, శేఖర్, వల్లీ బాషా, యువరాజ్‌తో పాటు ఎస్ఐలు తిప్పేస్వామి, శివకుమార్,చెన్నకేశవులు, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మండల సరిహద్దులో సీఎం బస చేసే స్థలం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత కట్టుదిట్టంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

# అధర్మంపై న్యాయానిదే విజయం

**ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా**



కేక్ కట్ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

**కడప కల్చరల్:** అధర్మంపై న్యాయానిదే విజయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఈస్టర్ పుణ్యదినాన్ని పురస్కరించుకుని ఆయన ముఖ్యఅతిథిగా రాత్రి నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీస్తును అన్యాయపు తీర్పును ఇచ్చి శిలువ ఎక్కించారని, ఆయన తన రక్తాన్ని చిందించి తన దుర్దశకు కారణమైన పాపులకు సైతం మోక్ష మార్గం ప్రసాదించారని తెలిపారు. అలాంటి నిజాయితీపరులకు చావులేదని, అధర్మంపై న్యాయానిదే అంతిమ విజయమన్నారు. ఈ సందర్భంగా ఆయన కథోలిక మేత్రాసన వికర్‌జనరల్ రెవరెండ్ బాలరాజుతో కలిసి క్రీస్తు పునరుత్థాన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభువును అనుసరించినవారికి మరణం లేదని, శారీరకంగా మరణించినా అది తాత్కాలికమేనన్నారు. మరణం మన దరికి చేరకుండా ప్రభువు మనతో ఉన్నారని తెలిపారు. పాస్టర్ గుడిమె దైవసహాయం కూడా ఈస్టర్ సందేశం అందజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ గురువులు ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషాను సత్కరించారు. ఆయన క్రైస్తవులందరికీ పునరుత్థాన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్ రావు, సహాయ డైరెక్టర్ విల్సన్, పాదర్ నాగిపోగు బాబు, డాన్‌బోస్కో గురువులు, ఆరోగ్యమాత, జేఎంజే మదర్‌లు, శాంతిసేవాసొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మడగలం ప్రసాద్ పాల్గొన్నారు.

# మైనార్టీలకు రిజర్వేషన్ తీసేస్తామని చెప్పగలరా?

**టీడీపీ, జనసేన నాయకులకు ఎంపీ మిథున్‌రెడ్డి సూటి ప్రశ్న**



మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్రంలో ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

**రాజంపేట టౌన్:** తెలంగాణాలో ముస్లిం మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్‌ను తీసేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చెప్పారని, అయితే ఎన్‌డీఏ కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఆంధ్రలో కూడా మైనార్టీలకు రిజర్వేషన్ సౌకర్యం తీసేస్తామని చెప్పగలరా? అని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. స్థానిక ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జెడ్పీ చైర్మన్, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో కలిసి ఎంపీ విలేకరులతో మాట్లాడారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నాలుగుశాతం రిజర్వేషన్ సౌకర్యాన్ని తీసుకొచ్చిన విషయాన్ని ఈసందర్భంగా ఎంపీ గుర్తు చేశారు. తెలంగాణాలో ముస్లింలకు రిజర్వేషన్‌ను తీసేసేవారు ఆంధ్రప్రదేశ్‌లో కూడా తీసేసే పరిస్థితి వస్తుందన్నారు. జగన్ సీఎంగా ఉంటే మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్ ఎప్పటికి కొనసాగుతుందన్నారు. యూనిఫాం సివిల్‌కోడ్ బిల్లుతో పాటు ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా వచ్చే ఏ బిల్లునైనా పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నంతవరకు రాష్ట్రంలో సీఏఏ బిల్లు, ట్రిపుల్ తలాక్‌లను ఆంధ్రలో అమలు చేసే ప్రసక్తే లేదన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ వైఎస్.కుటుంబంతో ముస్లిం మైనార్టీలకు ఉన్న అనుబంధం విడదీయరానిదన్నారు. రాజంపేటలో ముస్లీం మైనార్టీలకు అండగా వెంట ఉంటున్న పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్ రెడ్డి, గాలివీటి మదన్‌రెడ్డి, అజంతమ్మ పాల్గొన్నారు.

# చదువుకు ఊపిరి.. అమ్మ ఒడి



పిల్లలతో భువనేశ్వరి

నా పేరు భువనేశ్వరి. నా భర్త హరి హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద బాబు దేవాన్ష్ మూడో తరగతి చదువుతున్నాడు. పాప ఇంటి వద్ద ఉంది. బాబుకు అమ్మ ఒడి కింద రూ.15 వేలు వచ్చింది. పాఠశాలలో బాబుకు జగనన్న విద్యా కానుక కింద పుస్తకాలు,యూనిఫాం ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యామని బాబును బాగా చదివిస్తున్నాం.



నా పేరు కె.పల్లవి. మాది సామాన్య కుటుంబం. ఇద్దరు పిల్లలు. పెద్ద పాప భావన 8వ తరగతి, చిన్నపాప ప్రేరణ 5వ తరగతి చదువుతున్నారు. వారిని ప్రైవేటు బడుల్లో చదివించే స్థోమత లేదు.ఇద్దరిని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నా. గతంలో పుస్తకాలు,బ్యాగులకు రూ.8 వేల వరకు ఖర్చు వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అమ్మ ఒడి కింద రూ.15 వేలు వస్తున్నాయి. దీంతో పాటు జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు,యూనిఫాం అన్ని ఉచితంగా ఇస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ బడిలో మంచి బోధన ఉంది. పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వమే తీసుకున్నందున మాకు చాలా సంతోషంగా ఉంది.

- పేదింటి పిల్లల చదువులకు కొండంత అండ
- ఒక్కో విద్యార్థికి రూ.15వేలు మంజూరు
- ప్రతి విద్యార్థికి రూ.60 వేలు చొప్పున లబ్ధి



తరగతి గదిలో విద్యార్థులు

**మదనపల్లె సిటీ:** ఆర్థిక పరిస్థితి కారణంగా ఏ ఒక్క పేద విద్యార్థీ చదువుకు దూరం కారాదు. పనికి పంపే తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని బడికి పంపాలి. అందుకే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు చొప్పున జమ చేశారు. నాడు–నేడు పథకంలో ఓ పక్కన స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తూనే, బడిబయట పిల్లలు కూడా బడిలో చేరేలా అమ్మ ఒడి పథకాన్ని పైసా అవినీతికి ఆస్కారం లేకుండా అమలు చేశారు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం ఓ విద్యావిప్లవం. విద్యారంగం సంస్కరణల్లో భాగంగా సీఎం వై.ఎస్.జగనమోహన్‌రెడ్డి అమల్లోకి తెచ్చిన ఈ పథకాన్ని దేశమంతా ప్రశంసించింది. ప్రతి ఒక్కరికీ అత్యుత్తమ విద్య అందితే, రాష్ట్ర భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని నమ్మిన సీఎం వైఎస్ జగన్ ఆ దిశగా అవసరమైన ప్రతి చర్యనూ తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమైన వారంతా అమ్మ ఒడి ఉందనే ధీమాతో బడిబాట పడుతున్నారు. ఇందుకు 2019 నుంచి 2023 వరకు ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యే ప్రామాణికం.





**అర్హతే ప్రామాణికం**

విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించాలనే ఉన్నతాశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నప్పటికీ అమ్మఒడి మంజూరు చేస్తున్నారు. పథకం పారదర్శకంగా అమలు చేసే క్రమంలో సచివాలయం స్థాయిలో లబ్ధిదారుల బయోమెట్రిక్ అథంటికేషన్ (ఈకెవైసీ)తో ఆధార్‌కార్డు అనుసంధానించిన బ్యాంక్ ఖాతాకు డబ్బులు జమ చేస్తున్నారు. మధ్యవర్తుల బెడద, పైసా అవినీతి లేకుండా, నేరుగా లబ్ధిదారులకు డబ్బులు అందుతున్నాయి.

**ఒక్కో విద్యార్థికి రూ.60 వేలు లబ్ధి**

ఏటా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ఏడాదికి రూ.15 వేలు చొప్పున ప్రతి విద్యార్థికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొత్తంగా రూ.60 వేలు లబ్ధి చేకూరుతుంది. ముందస్తు షెడ్యూలు మేరకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మరో రూ.15 వేలు ఈ వేసవి సెలవుల అనంతరం బడి తెరిచిన మొదటి రోజునే తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏటా క్రమం తప్పకుండా అమ్మ ఒడి పథకం ద్వారా పేద విద్యార్థులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు.

**జిల్లాలో అమ్మ ఒడి లబ్ధి**

| సంవత్సరం | విడత | విద్యార్థులు | ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2022-23 | 3 | 1,57,292 | 235,93,80,000 |
| 2023-24 | 4 | 1,52,366 | 228,54,90,000 |

**విద్యాకానుకతో ధీమా**

జగనన్న విద్యాకానుక పథకం కింద ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్‌బ్యాగ్, నోట్ పుస్తకాలు, షూస్, సాక్స్, మూడు జతల యూనిఫాం( కుట్టుకూలీతో సహా) ఇలా తొమ్మిది రకాల వస్తువులను ఇస్తున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.1,964.

**అమ్మ ఒడి వల్లే మా పాప చదువు**



మాది పేద కుటుంబం. నాకు ఇద్దరు పిల్లలు. పిల్లలను చదవించుకోవాలంటే కష్టంగా ఉండేది. పాఠశాల తెరిచే రోజుకు బట్టలు, పుస్తకాలు కొనాలంటే అప్పులు చేయాల్సి వచ్చేది. జగనన్న సీఎం అయిన వెంటనే మా బిడ్డ సనకు అమ్మఒడి కింద డబ్బులు వచ్చాయి. స్థానిక ఉర్దూ మున్సిపల్ పాఠశాలలో చదువుతోంది. పాఠశాలలో జగనన్న విద్యాకానుక కింద పుస్తకాలు, దుస్తులు ఇచ్చారు. సీఎంకు రుణపడిఉంటాం.

– షహరాభాను, బాపనకాలువ, మదనపల్లె

**జగనన్న మేలు మరువలేం**



నా పేరు శిరిషా, నా భర్త వెంకటరమణారెడ్డి. ఓ బేకరీ షాపులో పని చేస్తున్నాడు. నాకు జ్ఞానప్రకాష్, రోహిత్‌కుమార్ ఇద్దరు పిల్లలు. పిల్లలను చదివించాలంటే కష్టంగా ఉండేది. పుస్తకాలు, యూనిఫాం కొనాలంటే అప్పులు చేయాల్సి వచ్చేది. జగనన్న సీఎం అయ్యాక మా బిడ్డకు అమ్మ ఒడి కింద డబ్బి వస్తున్నాయి. జగనన్న మేలు మరవలేము.

– శిరిషా, బీటీ కాలేజీ రోడ్డు, మదనపల్లె

## క్లుప్తంగా

### భూ వివాదంలో ఘర్షణ

మదనపల్లె : భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ పాలెంకొండకు చెందిన చిన్నప్ప, నాగరాజుల మధ్య గత కొంత కాలంగా భూ వివాదం నడుస్తోంది. భూమికి సంబంధించి కోర్టులో కేసు విచారణలో ఉంది. ఈ క్రమంలో వివాదస్పద భూమిలో బోరు ఏర్పాటు విషయమై ఇరువురి మధ్య గొడవ జరిగింది. అందులో భాగంగా నాగరాజ కొడవలితో చిన్నప్పపై దాడి చేసేందుకు ప్రయత్నించగా, అదే కొడవలి తీసుకుని చిన్నప్ప నాగరాజుపై దాడి చేశాడు. ఈ దాడిలో నాగరాజ తీవ్రంగా గాయపడగా, చిన్నప్ప సైతం గాయపడ్డాడు. ఇరువురిని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం నాగరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆహ్వానం


పసుపులేటి శంకర్

నందలూరు (రాజంపేట) : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జీవితం, నైపుణ్యం, నేటి యువతకు అవసరమైన విషయాలపై ఉపన్యసించడానికి తనకు ఆహ్వానం అందిందని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తారకేశ్వర, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వరరాజు తనను ఆహ్వానించారన్నారు.

### విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల వెంకటాపురం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కొమ్మూరు జయరామిరెడ్డి (65) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ చిన్నపెద్దయ్య కథనం మేరకు.. గ్రామంలోని జయరాంరెడ్డి ఇంటిలో ఒంటరిగా ఉండే వాడు. మూడు రోజుల క్రితం ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్ తగలడం వల్ల విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. ఇంటిలో ఒకడే ఉండటం వల్ల ఈ విషయం బయటకు తెలియలేదు. ఆదివారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు, బంధువులు గమనించి పోలీసులకు తెలపారు. వారు కేసు నమోదు చేసి వైద్యులచే పోస్టుమార్టం నిర్వహించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కంప చెట్లలో రసూల్ మృతదేహం

వేముల : మండలంలోని మబ్బు చింతలపల్లి క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పులివెందులకు చెందిన రసూల్ ఎస్ఎంఎస్ కంపెనీలో పని చేస్తుండే వాడు. అతను రాత్రి విధుల నిమిత్తం వెళ్తుండగా మోటార్ సైకిల్ అదుపు తప్పి మృతి చెందాడా, గుర్తు తెలివాహనం ఢీకొని ఈ ప్రమాదం జరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది. సంఘటన ప్రాంతంలో మోటార్ సైకిల్ పది మీటర్ల దూరంలో పడిపోగా.. వ్యక్తి కంప చెట్లలో పడిపోయాడు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

# శుభాల తోరణం.. రంజాన్ మాసం

- ప్రత్యేక నమాజ్‌లలో ముస్లింలు
- భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు


జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మసీదు

రాజంపేట : రంజాన్ మాసం ఆధ్యాత్మిక మాసంగా కొనసాగుతోంది. ఈ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో వారు చేసే ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమం ఎన్నో రేట్ల ఫలితాలను అందిస్తుందనేది వారి విశ్వాసం. ఆకాశంలో నెలవంక కనిపించడంతో మాసం ఆరంభమవుతుంది. మార్చి 12 నుంచి రంజాన్ ఉపవాసదీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, రైల్వేకోడూరు, రాజంపేట, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో ముస్లింలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**రంజాన్ పరమ పవిత్రం**

రంజాన్ మాసం భూమిపై ఖురాన్ అవతరించిన నెలగా ఇస్లాం గ్రంథాలు చెబుతున్నాయి. ముస్లింలు ఉపవాస దీక్షలో పాల్గొంటారు. ఈ నెలలో సఫిల్ చదివితే ఫరజ్ చదివినంతగా అంటే 70 సార్లు నమాజ్ చేసిన పుణ్యం వస్తుందని ఇస్లాం గ్రంథాలు ప్రభోదిస్తున్నాయి. తాక్‌రాత్ రోజులకు ప్రత్యేకత ఉంది. ఈ నెల రోజులు ఉపవాసదీక్షలు చేపట్టి అభాగ్యులకు దానాలు చేస్తూ ఇతోధిక సాయాన్ని ముస్లింలు అందిస్తారు. ఈ కఠోర దీక్షల ద్వారా ప్రతి ముస్లిం వ్యక్తిగత క్రమశిక్షణతోపాటు చెడు ఆలోచనలు, చెడుపనుల నుంచి తనను తాను నియంత్రించుకుంటాడు.

**దానధర్మాలకు ప్రాధాన్యత**

రంజాన్‌మాసంలో ముస్లింలు దానధర్మాల (జకాత్, ఫిత్రా)కు అత్యధిక ప్రాధాన్యమిస్తారు. ప్రతి ముస్లిం ఫిత్రా (నిర్ణీతదానం) తప్పనసరిగా చేయాలి. ఏటా ఫిత్రా రుసుంను నిర్ణయిస్తారు. కుటుంబంలోని సభ్యులందరూ అప్పుడే పుట్టిన పసికందుతో సహా ఫిత్రా ప్రకారం దానం చేయాలి.

**మసీదులలో ప్రార్థనలు**

రోజా పాటించే సమయంలో ముస్లింలు తప్పనిసరిగా నమాజ్‌కు మొదటి ప్రాధాన్యత ఇస్తారు. మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపవాసదీక్షలో ఐదుపూటల నమాజ్ చేస్తారు. దీనికి అదనంగా దీక్షల మాసమంతా 'తరావిస్' నమాజ్‌ను కూడా భక్తిశ్రద్ధలతో ఆచరించడం రంజాన్ ప్రత్యేకత. రాత్రి ఎనిమిదిన్నర గంటల నుంచి పది గంటల వరకూ సాగే తరావీహ్ నమాజ్‌లో ఖురాన్ పఠనం చేస్తారు. నిత్యం అల్లా నామస్మరణలతో ముస్లింలు గడుపుతారు.

**హలీం రుచులు ప్రత్యేకం**

రంజాన్‌మాసంలో లభించే ఒక ప్రత్యేక వంటకం హలీం. కొన్నేళ్ల వరకూ కేవలం హైదరాబాద్‌కే పరిమితమైన హలీం ఇప్పుడు జిల్లా కేంద్రం, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండలాల వరకు వచ్చేసింది. హలీం తయారీలో పలురకాల బలవర్ధకమైన ద్రవ్యాలతోపాటు పలు సుగంధ ద్రవ్యాలను వినియోగిస్తారు. వీటితోపాటు గోధుమ, మాంసం హలీం తయారీకి ప్రధాన ముడిసరుకులు. మిశ్రమాన్ని రాగి పాత్రలో సుమారు ఎనిమిది గంటల పాటు ఉడికిస్తారు. హలీంకు త్వరగా జీర్ణమయ్యే గుణం ఉండటం వల్ల రోజంతా ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలు దీక్ష అనంతరం దీనిని ఎక్కువగా తీసుకుంటారు. వేడివేడిగా ఉన్నప్పుడే హలీం రుచి ఆస్వాదించాలని వ్యాపారులు చెబుతున్నారు.

**మసీదుల్లో సందడి**

రంజాన్ మాసం వచ్చిందంటే మసీదులన్నీ కిటకిటలాడుతుంటాయి. మసీదులో రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులతోపాటు సహర్ విందులు కూడా జరుగుతుంటాయి. జిల్లాలో వేల సంవత్సరాలు నుంచి ఉన్న మసీదులు ఉన్నాయి. తాజాగా నిర్మించిన మసీదులు ఉన్నాయి. వీటిలో వందల సంఖ్యలో ముస్లింలు రోజా ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. అదే శుక్రవారాల్లో అయితే ఆ సంఖ్య మరింత పెరిగిపోతుంది.

**ఆకలిదప్పికలను తెలుసుకోవాలని చెబుతుంది**



సమాజంలోని పేదల ఆకలిదప్పికలను తెలుసుకొని వారికి అండగా ఉండాలని రంజాన్ మాసం చెబుతుంది. మానవులు వారి తప్పులను సంస్కరించుకొని ఉన్నత జీవితాన్ని గడిపేందుకు, సమాజంలో పేదలకు అండగా ఉండే విధంగా నడుచుకునేందుకు అల్లా రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలను నిర్దేశించారు. తోటి మానవులు సుఖంగా ఉండేందుకు ఏ విధంగా నడుచుకోవాలో రంజాన్ మాసం ఉపదేశిస్తుంది.

\- సయ్యద్‌అమీర్, జిల్లా సెక్రటరీ, వక్ఫ్‌బోర్డు.

**రంజాన్ దీక్షలతో అమోఘమైన ఫలితం**



రంజాన్ మాసం ముస్లింలకు అమోఘమైన ఫలితాన్ని ఇవ్వడానికి అల్లా ప్రసాదించిన అద్భుతమైన వరం. మానవులను సంస్కరించి వారిని దైవానికి చేరువగా తీసుకెళ్లే మార్గంను రంజాన్ చూపిస్తుంది. మానవులు ఏ విధంగా నడుచుకోవాలి. దైవం పట్ల, సమాజం పట్ల ఎటువంటి బాధ్యతలు నిర్వర్తించాలనే అంశాలను కూడా రంజాన్‌మాసం తెలియచేస్తుంది. అందుకే రంజాన్ మాసం మానవాళికి సర్వశుభాలను చేకూర్చే మాసం.

-సయ్యద్‌సాహెబ్, వ్యాపారి, నందలూరు

# హడలెత్తిస్తున్న హైనా

- పది రోజుల క్రితం హైనా దాడిలో దూడ మృతి
- రాత్రి హైనా బారి నుంచి తప్పించుకున్న రైతులు
- రంగంలోకి దిగిన అటవీ శాఖ


మామిడి రైతుతో మాట్లాడుతున్న రేంజ్ అధికారి మదన్‌మోహన్

పెద్దతిప్పసముద్రం : పీటీఎం సమీపంలోని బోడిగుట్ట పరిసర ప్రాంతాల్లో గత పది రోజులుగా సంచరిస్తున్న హైనా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అంతేగాక హైనాను ప్రత్యక్షంగా చూసిన రైతులు, హైనా బారి నుంచి తప్పించుకున్న రైతులు చిరుత పులులు వచ్చేశాయి అంటూ ప్రాణ భయంతో గ్రామంలోకి పరుగులు తీసి ఊపిరి పీల్చుకున్నారు. గత 10 రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన కల్లూరి నాగరాజు అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసుకున్న షెడ్డులో తాము ఎవరూ లేని సమయంలో హైనా వచ్చి.. నెల రోజుల వయసు ఉన్న దూడ గొంతు భాగంలో రక్తం పీల్చి తీవ్రంగా గాయపరచడంతో అక్కడికక్కడే మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ నెల 30న ఉదయం మామిడి చెట్లకు నీరు పారగడుతుండగా చెట్టుపై నుంచి ఒక్కసారిగా హైనా కిందికి దూకడం చూసిన బూరగ రవనప్ప అనే రైతు హడలెత్తి పరుగులు తీశాడు. అదే రోజు రాత్రి పీటీఎంకు చెందిన పాల హరి, గంగులప్ప అనే ఇద్దరు రైతులు పొలం వద్దకు వెళ్లగా మూడు హైనాలు సంచరించడాన్ని గుర్తించారు. వారి వద్ద ఉన్న టార్చిలైట్‌ను హైనా వైపు వేయగా అవి రైతుల వద్దకే ఎదురుగా రావడంతో హడలెత్తిపోయిన వారు టార్చిలైట్ ఆఫ్ చేసి ఏదో విధంగా ఊళ్లోకి వచ్చేశారు. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న అటవీ శాఖ రేంజ్ అధికారి మదన్‌మోహన్, సెక్షన్ అధికారి మోహన్‌లు సిబ్బందితోపాటు ఎంపీపీ మహమూద్, స్థానిక సర్పంచ్ తమక శంకర్‌తో కలసి ఆదివారం బోడిగుట్ట పరిసర అటవీ ప్రాంతాన్ని, మామిడి తోటను పరిశీలించారు. పులి జాడలు అని నమ్ముతున్న రైతాంగ ప్రజల అనుమానాలను అధికారులు పటాపంచలు చేశారు. చిరుత పులుల ఆనవాళ్లు కాదని, హైనా పాద ముద్రలు అని తేల్చి చెప్పారు. ఈ పరిసరాల్లో హైనా కంటపడితే తక్షణం తమకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని వారు రైతులకు సూచించారు.

**చిరుతల సంచారం వదంతులే**

ఈ ప్రాంతాల్లో చిరుతుల సంచారం వదంతులు మాత్రమేనని రేంజ్ అధికారి మదన్‌మోహన్ అన్నారు. భారత్‌లో అంతరించిపోతున్న ఈ చీతా జాతిని పునరుత్పత్తి చేసేందుకు మదనపల్లి పరిసరాల్లో దోహద పడుతుందనే యోచనలో వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు చెందిన ముఖ్య శాస్త్రవేత్త రమేష్ ఉన్నట్లు అటవీ శాఖకు సమాచారం అందిందని ఆయన తెలిపారు. టెరన్ ఏరియాగా పిలిచే మదనపల్లి రేంజ్ ప్రాంతంలో ఉన్న 18 మండలాల్లోని 70 వేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో కొండ గుట్టల్లో గడ్డి విపరీతంగా పెరిగే అవకాశాలు ఉన్న ప్రదేశాలు ఉన్నాయన్నారు. చీతాల పునరుత్పత్తి అధ్యయన కేంద్రం ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందనే భావనలో శాస్త్రవేత్తలు ఉన్నారని వెల్లడించారు.

**రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తాం**



హైనా అడుగు జాడలను గుర్తించాం. అటవీ శాఖకు చెందిన ఆరుగురు సభ్యుల బృందంతో రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తాం. హైనా జాడలు, కదలికలను కనిపెట్టి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం చేరవేస్తాం. జూ పార్కు నుంచి వైద్య బృందంను రప్పించి వాటిని పట్టుకుని జంతు సంరక్షణ శాల లేదా నల్లమల లాంటి పెద్ద అటవీ ప్రాంతాలకు తరలిస్తాం. ప్రధానంగా ఏనుగులు, చిరుత, హైనా లాంటి జంతువుల కారణంగా మూగ జీవాలకు, మనుషులకు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లితే తక్షణం అటవీ శాఖకు సమాచారం అందజేస్తే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఎక్స్‌గ్రేషియా మంజూరు అవుతుంది. ప్రధానంగా రైతులు రాత్రివేళ పొలాలకు వెళ్లే సమయాల్లో ఆయుధాలను వెంట తీసుకెళ్లాలి.

-మదన్‌మోహన్, అటవీ శాఖ రేంజ్ అధికారి

### కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని డ్రైవర్ కొట్టాలలో నివాసం ఉంటున్న బైరి బాలవాసు (37) అనే కానిస్టేబుల్ ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. కానిస్టేబుల్ బాలవాసు కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నాడు. గతేడాది డిసెంబర్‌లో పులివెందులలోని జెండామాను వీధిలో తన భార్య జానకిని గొంతు నులిమి హత్య చేశాడు. ఈ కేసులో పులివెందుల పోలీసులు బాలవాసును అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. అతనిపై హత్య కేసు నమోదు కావడంతో పోలీసు ఉన్నతాధికారులు అతన్ని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో రిమాండులో ఉన్న అతను వారం రోజుల క్రితం బెయిల్‌పై బయటికి వచ్చాడు. డ్రైవర్ కొట్టాలలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతను ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యను హత్య చేయడంతో తన జీవితం గురించి తలుచుకుంటూ రోజూ అతను మథన పడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే అతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు.

### గడ్డివాముల దగ్ధం

కమలాపురం : కమలాపురం పట్టణంలోని ఎంపీడీఓ కాలనీలో నివాసం ఉంటున్న గంగవరం రామిరెడ్డికి చెందిన రెండు గడ్డి వాములు దగ్ధం అయ్యాయి. ఆదివారం ఈ ఘటన జరగడంతో గుర్తించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. కడప నుంచి వాహనం వచ్చి మంటలను ఆర్పింది. అయితే గడ్డి, మినుము పొట్టు వాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సంఘటనకు గల కారణాలు తెలియరాలేదు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వాల్మీకిపురం : గుర్తు తెలియని ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని చింతపర్తిలో చోటు చేసుకొంది. వివరాలు.. మండలంలోని చింతపర్తి వైన్‌షాప్ సమీపంలోని బాహుదానదిలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో బాహుదానది వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ వ్యక్తి ఎరుపు రంగు టీ షర్టు, నీలం రంగు ఫుల్ డ్రాయర్, కాళ్లకు బెల్టు చెప్పులు వేసుకొని ఉన్నాడని ఎస్సై నాగేశ్వర రావు తెలిపారు. అలాగే ఆ వ్యక్తి ఎడమ చేతి మీద రాములమ్మ, బాలరాజు అని తెలుగులో పచ్చబొట్టులు ఉన్నాయని, ఆ వ్యక్తి ఆచూకీ గుర్తించిన వారు ఎస్సై నాగేశ్వర రావు 9440900712, సీఐ పులిశేఖర్ 9440796714 తెలియజేయాలని సూచించారు.

# వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తల చేరిక


ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నరసాపురం వాసులు

మదనపల్లె : రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీ నరసాపురానికి చెందిన 200 మంది టీడీపీ కార్యకర్తలు ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డిలు వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు రమణ, మునిరెడ్డి, చెంగప్ప, తిమ్మయ్య, నారాయణ, ఎల్లప్ప ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. నరసాపురం గ్రామం ఐకమత్యానికి పెట్టింది పేరని, మూకుమ్మడిగా గ్రామస్తులందరూ మాట్లాడుకుని, సీఎం జగన్ మోహన్‌రెడ్డి మదనపల్లె పర్యటన ముందు వైఎస్సార్ సీపీలోకి చేరడం సంతోషంగా ఉందన్నారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ అందించిన సంక్షేమం, అభివృద్ధితో టీడీపీ నాయకులు, తటస్థులు వైఎస్సార్‌సీపీ వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం అవసరమని, ఆయన గెలుపులో తామంతా భాగస్వామ్యులవుతామని ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. కార్యక్రమంలో రామసముద్రం మండల కన్వీనర్ నందకిశోర్‌రెడ్డి, జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.




### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బసినికొండ అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ సమీపంలో నివాసమున్న శంకర(48) కురవంక మున్సిపల్ వాటర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం వేకువజామున తన భార్యతో కలిసి పుంగనూరు రోడ్డులో జరుగుతున్న కనుమలో గంగమ్మ జాతరకు వెళ్లి అమ్మవారి దర్శనం అనంతరం ఇద్దరు ఇంటికి నడుచుకుంటూ వస్తున్నారు. ఇంతలో తట్టివారిపల్లెకు చెందిన అమృత్‌కుమార్ (20) బైక్‌పై వేగంగా వచ్చి నడిచి వెళుతున్న దంపతులను రింగ్‌రోడ్డు సమీపంలో ఢీకొన్నాడు. ప్రమాదంలో శంకర, అమృత్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం అమృత్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. అదే విధంగా స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్‌పై అదుపు తప్పి కిందపడి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన కళావతమ్మ(60) తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా మార్గంమధ్యలో మాచిరెడ్డిగారిపల్లె వద్ద ఉన్న స్పీడ్‌బ్రేకర్‌ను వాహనం దాటే క్రమంలో కళావతమ్మ బైక్‌పై నుంచి అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

**చెట్ల కొమ్మలు నరుకుతుండగా..**

మేకలను అడవికి తోలుకెళ్లి వాటికి మేత సేకరించే క్రమంలో కాపరి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. పెంచుపాడు పంచాయతీ కట్టుబావి గొల్లపల్లికి చెందిన సిద్దప్ప (70) రోజువారి పనుల్లో భాగంగా మేకలను మేపేందుకు అడవికి వెళ్లాడు. వాటి మేత కోసం చెట్ల కొమ్మలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు చేతిలోని కొడవలి కాలుకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాసరుద్దీన్



రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా సయ్యద్ నాసరుద్దీన్ ఎన్నికయ్యారు. సోమవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కొలువు తీరనున్నది. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎస్.చంద్రశేఖర్, కోశాధికారిగా రమణ, వైస్‌ప్రెసిడెంట్‌లుగా వై.సురేష్‌రాజు, జల్లి నారాయణ ఎన్నికయ్యారు. మహిళ ప్రతినిధిగా బి.శోభారాణిని ఎంపిక చేశారు. కార్యవర్గంలో జాయింట్ సెక్రటరీలుగా హెచ్.సుదర్శన్‌రెడ్డి, ఎం.గోవర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్ వీ.చౌదరిలు నియమితులయ్యారు. లైబ్రరీ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.శివకుమార్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెక్రటరీగా ఎస్.మహబూబ్ బాషాలను ఎంపిక చేశారు.

# నడక ఉద్యమం ఉధృతం


శరత్‌కుమార్‌రాజును సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రాజంపేట : నడకతోనే మెరుగైన ఆరోగ్యం అనే నినాదాన్ని ఉద్యమం రీతిలో ఉధృతం చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మురళీమోహన రావు, తెలంగాణ, ఏపీ, ఒడిస్సా, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు తెలిపారు. ఆదివారం స్థానిక తాళ్లపాక రహదారిలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ 157 కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు ఆలవార్‌దాస్ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంస్థ విశాఖలో ఆవిర్భవించిందన్నారు. దేశంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్, మాజీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్లు వాకర్ రామానందం, నాగభూషణం, సుబ్బారెడ్డి, కృష్ణకుమారి, హనుమంతరావు, సీతారామయ్య, శర్మ, కో-ఆర్డినేటర్ కోనేటి రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

**తరలివచ్చిన ఐదు రాష్ట్రాల డెలిగేట్స్**

ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ శరత్‌కుమార్‌రాజు నేతృత్వంలో వాకర్ అసోసియేషన్ రాజంపేట (వార్) ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ సుబ్బరామరాజు, సెక్రటరీ డా.టీ.పెంచలయ్య, ట్రెజరర్ వెంకటయ్య ఆధ్వర్యంలో తలపెట్టిన కౌన్సిల్‌కు ఐదు రాష్ట్రాల నుంచి వాకర్ ఇంటర్నేషనల్ డెలిగేట్స్ తరలివచ్చారు. శాన్వి ఇంటర్నేషనల్ క్యాంపస్‌లో వాకర్స్‌తో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పలువురు మేధావులు, వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి జ్ఞాపికలు అందచేసి శాలువాలను కప్పి సన్మానించారు.

# నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

**ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు**



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన ధ్రువీకరణపత్రాలు అన్నీ కూడా ఉచితంగా తీసుకోవడం జరిగింది. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రావాలంటే మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకునేవాళ్లం. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ కూడా ఉచితంగా సచివాలయం ద్వారా అందజేస్తున్నట్లు వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. అంతేకాకుండా ఈబీసీ నేస్తం ద్వారా రూ.15 వేలు తీసుకున్నాము. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కూడా అర్హులైన వారికి ఇస్తుండటంతో మేము ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటాం.

\- బాదిరెడ్డిరత్నమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

**సొంత ఇంటి కల నెరవేర్చిన జగన్**



నాకు వివాహం అయ్యి దాదాపు 15 ఏళ్లు అయింది. అప్పటి నుంచి గత ప్రభుత్వాల పాలనలో ఇంటి స్థలం, ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులకు ఇంటి స్థలం ఇచ్చారు. అందులో భాగంగా మాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. అలాగే అందులోనే హౌసింగ్ తరఫున ఇంటిని మంజూరు చేయించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న మా సొంత ఇంటి కలను నేరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

\- గంగనపల్లి సావిత్రి, ఒంటిమిట్ట

**ముఖ్యమంత్రి మేలు మరిచిపోము**



నా పేరు మాదం వరలక్ష్మి. నా భర్త రామసుబ్బారెడ్డి. మేము వ్యవసాయ కూలీలం. ఆదాయం అంతంత మాత్రమే. మాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె దివ్య ప్రస్తుతం ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. కుమారుడు సునీల్ కుమార్ డిగ్రీ చదువుతున్నాడు. దివ్య 9వ తరగతిలో ఉండగా మొదటి సారి నాకు అమ్మ ఒడి పథకం కింద ఆర్థిక సాయం అందింది. ఇప్పటికి రెండు సార్లు ఈ పథకం కింద ఆర్థిక సాయాన్ని అందుకున్నాను. అది పిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడింది. అంతేకాదు మాకు సొంత ఇల్లు లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడపడుచులకు ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తున్నట్టు ప్రకటించడంతో నాకు ఇంటి స్థలం తోపాటు పక్కా ఇల్లు కూడా మంజూరైంది. ఇంటి స్థలం, ఇంటి విలువతోపాటు అమ్మఒడి ఆర్థిక సాయం కలిపి ప్రభుత్వం నుంచి నాకు రూ.8.89 లక్షల లబ్ధి చేకూరింది. ఒక కుటుంబానికి ఇంతకంటే ఏమి మేలు జరగాలి. అందుకే ముఖ్యమంత్రి మేలు మరిచిపోం.

\- మాదం వరలక్ష్మి, బండివారిపల్లె, మైదుకూరు మున్సిపాలిటీ

### బీజేపీపై ఉమ్మడి పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విపక్షాలను అణచి వేసేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీపై ఉమ్మడిగా పోరాటం చేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు నజీర్ అహ్మద్, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం ప్రాబల్యం కలిగినదని, పార్లమెంటు ప్రాబల్యం కలిగినది కాదని, పార్లమెంటు చట్టాలు రాజ్యాంగ లక్ష్యాలకు అనుకూలంగా లేకపోతే, సుప్రీంకోర్టు కొట్టి వేయవచ్చన్నారు. బీజేపీ భారత రాజ్యాంగ పీఠికలోని ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సోషలిజం లక్ష్యాలను విస్మరించి, దేశ విభజన వైపుగా, భావోద్వేగ రాజకీయాలు నడుపుతోందని వీటిని తిప్పికొట్టాలని పేర్కొన్నారు. బీజేపీ 10 సంవత్సరాల పరిపాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నిటి విశ్వాసనీయతను కోల్పోయే విధంగా, బీజేపీ జేబు సంస్థలుగా మార్చి, ప్రశ్నార్థకం చేసిన ఘనత దక్కించుకున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ సత్తార్, విష్ణు ప్రీతమ్‌రెడ్డి, చీకటి చార్లెస్, సుజాతరెడ్డి, చిన్న కుల్లాయప్ప, శ్యామలాదేవి, అలీఖాన్, సలావుద్దీన్, న్యాయవాది సుధాకర్, నాగరత్న, గౌరీ పాల్గొన్నారు.